నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నాం

మంచిర్యాలటౌన్, ఫిబ్రవరి 25: వేసవి లో వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నామని మంచిర్యాల సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ వీ గంగాధర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లోడ్ పెరిగే అవకాశం ఉన్నచోట ఇప్పటివరకు ఐదు పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామని, ఆరు పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచామని. 398కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామని, 135ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచామన్నారు. వేసవి ముందస్తు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకుని, అందుకు అనుగుణంగా సరిపడా మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేశామన్నారు. సబ్ స్టేషన్లలో సూక్ష్మ లోపాలను గుర్తించడానికి థర్మల్ ఇమేజింగ్ కెమెరాలను వాడుతున్నామని తెలిపారు. వోల్టేజ్ లో హెచ్చుతగ్గులు లేకుండా కెపాసిటర్ బ్యాంకులు ఎంతగానో ఉపయోగపడుతాయని చెప్పారు. అవాంతరాల్లేకుండా మెరుగైన విద్యుత్ సరఫరా చేస్తామని స్పష్టం చేశారు.

ఆసిఫాబాద్ టౌన్, ఫిబ్రవరి 25: వినియోగదారులకు మరింత మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడానికి ఎల్లవేళలా కృషి చేస్తున్నామని సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ ఆర్ శేషరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసిఫాబాద్ సర్కిల్ సిర్పూర్ కాగజ్‌నగర్ డివిజన్‌లో 132/33 కేవీ కౌటాల సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తయిందని, వారంలోగా అందుబాటులోకి వస్తుందని తెలిపారు. సబ్‌స్టేషన్ ద్వారా చింతలమానేపల్లి, బెజ్జూరు, కౌటాల, సిర్పూర్ మండలాల ప్రజలకు విద్యుత్ సరఫరా జరుగుతుందన్నారు. కౌటాల సబ్ స్టేషన్ నుంచి 104గ్రామాల ప్రజలకు అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్ అందుతుందని తెలిపారు.

ఉద్యమకారుడిని గెలిపించాలి

తాండూర్, ఫిబ్రవరి 25: పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా తెలంగాణ ఉద్యమకారుడు సర్దార్ రవీందర్‌సింగ్‌ను గెలిపించుకోవాలని బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు బడికల శ్రావణ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థి సంఘం మాజీ నాయకులు, బీఆర్ఎస్ కార్యకర్తగా కేసీఆర్‌తో వెన్నంటే ఉండి తెలంగాణ ఉద్యమంలో క్రియాశీల పాత్ర పోషించాడని గుర్తుచేశారు. రాష్ట్ర ఏర్పాటు తర్వాత బంగారు తెలంగాణ నిర్మాణంలో తనవంతు పాత్ర పోషించాడని తెలిపారు. ప్రజా సేవలో నిమగ్నమై ఉండే నేతలకు మండలిలో అవకాశం ఇస్తే ప్రశ్నించే గొంతుకై గళమెత్తి పట్టభద్రుల హక్కుల కోసం పోరాడుతాడని తెలిపారు. పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన రవీందర్‌సింగ్‌కి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు.

నేడు పత్తి కొనుగోళ్లు బంద్

తాండూర్, ఫిబ్రవరి 25: మహా శివరాత్రి సందర్భంగా మండలంలోని రెండు జిన్నింగ్ మిల్లులో బుధవారం మాత్రమే సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్ల ప్రక్రియను నిలివేస్తున్నామని మార్కెట్ కమిటీ కార్యదర్శి సిద్ధం భాస్కర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తిరిగి 27 గురువారం యథావిధిగా పత్తి కొనుగోళ్ల ప్రక్రియ ఉంటుందని తెలిపారు.

పుష్కర ఘాట్ మూసివేత

హాజీపూర్, ఫిబ్రవరి 25: ముల్కల్ల శివారులోని గోదావరి పుష్కర ఘాట్‌ను మూసివేసినట్లు తహసీల్దార్ శ్రీనివాస్‌రావ్ దేశ్‌పాండే, ఎస్ఐ గోపతి సురేశ్ మంగళవారం సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. శివరాత్రి పర్వదినం సందర్భంగా భక్తులు పుణ్యస్నానాలు చేసేందుకు ముల్కల్ల పుష్కర ఘాట్‌కు రావద్దన్నారు. గోదావరిలో నీటిమట్టం ఎక్కువగా ఉన్నందున భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకు అనుమతించడం లేదని తెలిపారు.

లక్షెట్టిపేట, ఫిబ్రవరి 25: మహాశివరాత్రి సందర్భంగా గోదావరి నది వద్ద ఏర్పాట్లను సీఐ నరేందర్, ఎస్ఐ సతీశ్ మంగళవారం పరిశీలించారు. గోదావరిలో నీటిమట్టం ఎక్కువగా ఉన్నందున లోతట్టు ప్రాంతాలకు భక్తులు స్నానాలకు వెళ్లకూడదని, గోదావరి వద్ద గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచామన్నారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

పెసర క్షేత్రం పరిశీలన

భీమారం, ఫిబ్రవరి25: మండల కేంద్రంలోని స్థానిక ఖాజీపల్లి, అంకుషాపూర్ గ్రామాల్లో పెసర పంటను ఏవో అత్తే సుధాకర్, ఏఈవో పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. పెసరలో రసం పీల్చే పురుగును గుర్తించామని, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించామని తెలిపారు.

పోలింగ్ సజావుగా సాగేలా సహకరించాలి

● జిల్లా ఎన్నికల అధికారులు, కలెక్టర్లు వెంకటేశ్ ధోత్రే, కుమార్ దీపక్ ● పోలింగ్ కేంద్రాల సందర్శన ● ఎన్నికల సామగ్రి పరిశీలన

ఆసిఫాబాద్ టౌన్: మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

నస్పూర్: ఎన్నికల సామగ్రిని పరిశీలిస్తున్న మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

ఆసిఫాబాద్ టౌన్, ఫిబ్రవరి25: జిల్లాలో పట్టభద్రుల, ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికల పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగేలా రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ, ఈ నెల 27న ఉదయం 8నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో సజావుగా సాగేలా సహకరించాలని తెలిపారు. పోలింగ్ రోజున ఉదయం 8గంటల కంటే ముందే ఏజెంటు కేంద్రాలకు హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ సామగ్రి పంపిణీకి సిద్ధం

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిర్వహణకు బ్యాలెట్ బాక్సులు, పోలింగ్ సామగ్రి సిద్ధంగా ఉన్నాయని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో బ్యాలెట్ బాక్స్‌లు, ఎన్నికల సామగ్రిని ఆయన పరిశీలించారు. ఈనెల 26న నిర్ణీత సమయానికి అధికారులు పోలింగ్ సామగ్రిని తీసుకోవాలని, భద్రతాచర్యల మధ్య పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లాలని సూచించారు.

ఓటర్లకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు

వాంకిడి, ఫిబ్రవరి 25: మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ నియోజకవర్గాల ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎన్నికల పోలింగ్‌లో ఓటర్లకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాటు చేయాలని కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే పేర్కొన్నారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ, ఈ నెల 27న జరిగే పోలింగ్‌లో ఓటర్లకు కనీస సౌకర్యాలు కల్పించాలని తహసీల్దార్ రియాజ్ అలీని ఆదేశించారు. దివ్యాంగ ఓటర్ల కోసం వీల్‌చైర్, ర్యాంప్ ఏర్పాట్లు చేయాలని, సమస్యలు తలెత్తకుండా పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. ఇక్కడ సీఐ సత్య నారాయణ, ఎస్ఐ ప్రశాంత్, ఆర్ఐ మజిత్, జీపీ కార్యదర్శి శివకుమార్, హెచ్ఎం నటరాజ్ ఉన్నారు.

ఎన్నికల సామగ్రి పంపిణీకి సిద్ధం

నస్పూర్, ఫిబ్రవరి 25: పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా ఈ నెల 27న ఉదయం 8 నుంచి సాయంత్రం 4గంటల వరకు జరగనున్న పోలింగ్ కోసం బ్యాలెట్ బాక్స్‌లు, ఎన్నికల సామగ్రి పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. మంగళవారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో అదనపు కలెక్టర్ మోతీలాల్, ఆర్డీవోలు శ్రీనివాస్‌రావు, హరికృష్ణతో కలిసి బ్యాలెట్ బాక్సులు, సామగ్రిని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో పట్టభద్రుల కోసం 40, ఉపాధ్యాయుల ఎన్నికల కోసం 18 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ర్యాండమైజేషన్ ప్రక్రియలో కేటాయించిన ప్రకారంగా నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో బ్యాలెట్ బాక్స్‌లు, ఇతర సామగ్రి పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో డీపీవో వెంకటేశ్వర్‌రావు, కలెక్టరేట్ పరిపాలన అధికారి రాజేశ్వర్, ఎన్నికల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎన్నికకు సర్వం సిద్ధం

కెరమెరి, ఫిబ్రవరి 25: పట్టభద్రుల ఎన్నికకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లను సిద్ధం చేసినట్లు తహసీల్దార్ దత్తు ప్రసాద్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మూడు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గురువారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4గంటల వరకు నిర్వహించే ఈ ఎన్నికల్లో 196 మంది పట్టభద్రులు, 20 మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. పోలింగ్ రిసిప్టులను ఇప్పటికే ఓటర్లకు అందజేసినట్లు తహసీల్దార్ తెలిపారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

దండేపల్లి, ఫిబ్రవరి25: మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ సంధ్యారాణి మంగళవారం పరిశీలించారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా శామియానాలు, తాగునీటి వసతులు కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. మండల కేంద్రంలో మూడు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని ఆమె తెలిపారు. ఆమె వెంట ఆర్ఐ భూమన్న, తదితరులు ఉన్నారు.

పోలింగ్ సజావుగా నిర్వహించాలి

లక్షెట్టిపేట, ఫిబ్రవరి 25: ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సజావుగా జరిగేలా అధికారులు విధులు నిర్వహించాలని తహసీల్దార్ దిలీప్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను సీఐ నరేందర్, అధికారులతో కలిసి పరిశీలించారు. ఎన్నికల నిబంధనలు తప్పకుండా పాటించాలని సూచించారు. ఇక్కడ ఎస్ఐ సతీశ్, అధికారులు ఉన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, ప్రైవేటు సంస్థలు, పరిశ్రమలు, ఇతర ట్రేడ్ సంస్థల్లో పని చేస్తున్న వారంతా ఓటు హక్కు వినియోగించుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

హాజీపూర్, ఫిబ్రవరి 25: నంనూర్ మాజీ ఉప సర్పంచ్ ఆనంద్ చారి ఇటీవల అనారోగ్యానికి గురికాగా, మంగళవారం మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే వెంట నాయకుడు విజితకుమార్, తదితరులు ఉన్నారు.

జాతర ఏర్పాట్లను పరిశీలించిన ఏఎస్పీ

జాతర ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఏఎస్పీ చిత్తరంజన్

వాంకిడి, ఫిబ్రవరి 25: మండల కేంద్రంలోని శివకేశవ ఆలయం తోపాటు పరిసర ప్రాంతాలను కుంమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా ఏఎస్పీ చిత్తరంజన్, ఆలయ కమిటీ చైర్మన్ గద్దె ప్రవీణ్‌కుమార్, సీఐ సత్యనారాయణ, ఎస్ఐ ప్రశాంత్ మంగళవారం పరిశీలించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న నాయకులు

సిర్పూర్(యూ), ఫిబ్రవరి 25: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తొడసం ధర్మారావు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని మహదేవ్ జాతరలో భాగంగా మంగళవారం కబడ్డీ పోటీలను ప్రారంభించారు. ఇక్కడ కమిటీ సభ్యులు గోవిందరావు, దౌలత్‌రావు, మానిక్‌రావు, లచ్చు ఉన్నారు.

అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేక్

మందమర్రి, ఫిబ్రవరి 25: మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని 24వ వార్డు ఊరు మందమర్రి గ్రామంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను మంగళవారం చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ పరిశీలించారు. అనంతరం గ్రామస్తులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

శిక్షణ ఎస్ఐలకు విధులపై అవగాహన

సీసీసీ నస్పూర్, ఫిబ్రవరి 25: సీసీసీ నస్పూర్‌లోని పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం 25మంది ట్రైనీ ఎస్ఐలు సందర్శించారు. ఈ సందర్భంగా వారికి పోలీస్‌స్టేషన్‌లోని రికార్డులు, రిసెప్షన్ వర్టికల్ విధానం, అడ్మిన్ వర్టికల్, స్టేషన్ రైటర్ వర్టికల్, ఎస్‌హెచ్‌వో వర్టికల్, తదితర అంశాలపై స్థానిక ఎస్ఐ సుగుణాకర్ అవగాహన కల్పించారు. పోలీస్ విధుల గుర్తించి వివరించారు. చిత్తశుద్ధి, క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలని వారికి సూచించారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

సీసీసీ నస్పూర్, ఫిబ్రవరి 25: నస్పూర్‌లోని సీతారాంపల్లి తెలంగాణ గ్రామీణ బ్యాంకులో మహిళలకు ఆర్థిక అక్షరాస్యతపై బ్యాంకు చీఫ్ మేనేజర్ జీ నరసింహస్వామి మంగళవారం అవగాహన కల్పించారు. ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా ఆర్థికపరమైన అంశాలపై మహిళలకు వివరించారు.

సెక్యూరిటీగార్డుల సమస్యలు పరిష్కరించాలి

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 25: శ్రీరాంపూర్ ఏరియా ప్రైవేట్ కాంట్రాక్టు సెక్యూరిటీగార్డుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం బీఎంఎస్ ఉపాధ్యక్షుడు నాతాడి శ్రీధర్‌రెడ్డి సెక్యూరిటీ ఆఫీసర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రైవేట్ సెక్యూరిటీగార్డుల సమస్యలు పరిష్కరించాలని, గార్డు ఇతర కారణాలతో ఉద్యోగం వదిలివెళ్తే.. మరొకరికి అవకాశం కల్పించాలని కోరారు. ఇక్కడ బీజేపీ జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి మిట్టపెల్లి మొగిళి, నాయకులు కలవేణ స్వామి, సురేశ్, దేవ దామోదర్, ఇందూరి నరేశ్, మహేందర్, తదితరులు ఉన్నారు.

గుర్తుతెలియని శవం లభ్యం

వాంకిడి, ఫిబ్రవరి 25: మండలంలోని టోల్ ప్లాజా ఖమాన ఎక్స్ రోడ్డు సమీపంలోని జాతీయ రహదారి పక్కన ఓ మృతదేహం ఉన్నట్లు సమాచారం రావడంతో ఎస్ఐ ప్రశాంత్ ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 8712670531 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఆలయంలో ఇరువర్గాల పోరు

చెన్నూర్ రూరల్, ఫిబ్రవరి 25: చెన్నూర్ మండలంలోని కత్తెరసాల గ్రామంలోని పుణ్యక్షేత్రమైన శ్రీ మల్లికార్జున ఆలయంలో ఇరువర్గాల ఒగ్గు పూజారుల మధ్య వారంరోజులుగా వర్గపోరు నడుస్తున్నది. జాతర ప్రారంభం అవుతున్న సందర్భంగా బుధవారం ఇరువర్గాల మధ్య చిన్న ఘర్షణ చోటుచేసుకున్నది. ఆలయంలో గత కొన్ని ఏండ్ల నుంచి ఆలయానికి ముగ్గురు పూజారులు విధులు నిర్వహిస్తున్నారు. గత కొన్ని రోజుల క్రితం ఇద్దరు పుజారులు పదవి విరమణ పొందారు. వారి స్థానంలో అధికార పార్టీ నాయకలు, నూతన కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నుంచి లెటర్ ప్యాడ్ ఉందని, గ్రామస్తులకు సమాచారం ఇవ్వకుండా వారికి అనుకూలంగా ఉన్న నలుగురు ఒగ్గు పూజారులను విధులోకి తీసుకున్నారు. పదవి విరమణ పొందిన వారు కూడా విధులో కొనసాగుతుంటే పులువరు పూజారులు అభ్యంతరం చేశారు. మంగళవాం రాత్రి గ్రామంలోని ఒగ్గు పూజారులలో వర్గపోరు ఏర్పడింది. ఆలయ పూజారి మల్లేశ్ స్పృహ తప్పి కుప్పకూలిపోయాడు. వెంటనే 108లో చెన్నూర్ ప్రభుత్వ దవాఖానకు, అక్కడి నుంచి మంచిర్యాల దవాఖానకు తరలించారు. చెన్నూర్ సీఐ రవీందర్ ఘటనా స్థలానికి చేరుకొని ఒగ్గు పూజారులకు నచ్చజెప్పి వారిని శాంతింపజేశారు.

ఉద్యోగ విరమణ సహజం

లక్షెట్టిపేట, ఫిబ్రవరి 25: ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ సహజమని ఎంఈవో హెలెన్ ధారతి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని జడ్పీహెచ్ఎస్(బాయ్స్) ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న నగునూరి సుపర్ణ (స్కూల్ అసిస్టెంట్ సోషల్) పదవి విరమణ కార్యక్రమానికి ఎంఈవో ముఖ్యఅతిథిగా హాజరై, సువర్ణను సత్కరించారు.

పాత మార్కెట్‌లో అగ్నిప్రమాదం

ఆసిఫాబాద్ టౌన్, ఫిబ్రవరి 25: జిల్లా కేంద్రంలోని బాపునగర్‌లో గల పాత కూరగాయల మార్కెట్‌లో సోమవారం అర్ధరాత్రి అగ్ని ప్రమాదం చోటుచేసుకున్నది. చుట్టూ ఉన్న దుకాణాలకు సంబంధించిన చెత్తాచెదారం, కవర్లను పాత మార్కెట్ ప్రాంతంలో దుకాణాదారులు వేస్తున్నారు. చెత్తకు అగ్గి అంటుకోవడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. స్థానికులు సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పేశారు. దీంతో భారీ ప్రమాదం తప్పింది.

వేలంలో భారీగా పాల్గొన్న క్రీడాకారులు

వేలంలో పాల్గొన్న ఫ్రాంచైంజీ టీంలు, క్రీడాకారులు

కౌటాల, ఫిబ్రవరి 25: మండల కేంద్రంలోని మినీ స్టేడియంలో నిర్వహించే కేపీఎల్ (కౌటాల ప్రీమియర్ లీగ్) క్రికెట్ పోటీల్లో మంగళవారం క్రీడాకారుల వేలం నిర్వహించారు. పోటీల్లో పది ఫ్రాంచైంజీలు క్రీడాకారులకు వేలంపాడారు. మండల కేంద్రంతో పాటు సిర్పూర్, కాగజ్‌నగర్, చింతలమానెపల్లి, బెజ్జూర్, పెంచికల్‌పేట, దహెగాం మండలాల నుంచి 220మంది క్రీడాకారులు వేలంలో పాల్గొనగా, వారిని కొనుగోలు చేసేందుకు ఫ్రాంచైజీలు పోటీపడ్డారు. ఒక్కో క్రీడాకారుడికి ₹500 నుంచి ₹వేలాది రూపాయల వరకు కైవసం చేసుకున్నారు. కేపీఎల్ పోటీల్లో మొదటి బహుమతి ₹లక్ష, రెండో బహుమతి ₹50వేలు ఉండడంతో ఫ్రాంచైజీలు క్రీడాకారులను కొనుగోలు చేసేందుకు పోటీపడ్డాయి.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

రాజేశ్(ఫైల్)

కన్నెపల్లి, ఫిబ్రవరి 25: వీగాం గ్రామానికి చెందిన దుర్గం రాజేశ్(29) తన సోదరుడు అభిలాష్‌తో కలిసి బైక్‌పై మల్లీడి గ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో బెల్లంపల్లి మండలం పెర్కపల్లికి చెందిన శ్రావణ్‌కుమార్ తన తండ్రి అంజయ్యతో కలిసి దహెగాం వైపు వెళ్తున్నాడు. పోలంపల్లి స్టేజీ వద్ద రెండు వాహనాలు ఢీకొనడంతో రాజేశ్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. అభిలాష్‌కు తీవ్రంగా, శ్రావణ్‌కుమార్, అంజయ్యకు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. గాయపడ్డ వారిని దవాఖానకు తీసుకెళ్లారు. రాజేశ్ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం బెల్లంపల్లి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. రాజేశ్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు కన్నెపల్లి ఎస్ఐ గంగారాం తెలిపారు.

మెరుగైన వైద్యసేవలందించాలి

● డీఎంహెచ్‌వో డాక్టర్ హరీశ్‌రాజ్ ● నస్పూర్ పీహెచ్‌సీ సందర్శన

ఆరోగ్య మహిళా కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ హరీశ్‌రాజ్

సీసీసీ నస్పూర్, ఫిబ్రవరి 25: ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ నాణ్యమైన వైద్య సేవలందించాలని మంచిర్యాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ హరీశ్‌రాజ్ సూచించారు. మంగళవారం నస్పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించారు. సీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన ఆరోగ్య మహిళా కేంద్రంలో గల వార్డులు, ల్యాబ్, మందుల నిల్వలను పరిశీలించి, మాట్లాడారు. దవాఖాన ఆవరణను సందర్శించి, పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా నిర్వహించాలని, నిత్యం పరిశుభ్రంగా ఉండే విధంగా చూసుకోవాలన్నారు. మహిళల సంక్షేమంపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అనారోగ్యంతో బాధపడుతున్న మహిళలకు ఆరోగ్య మహిళా కేంద్రంలో పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను ఇవ్వాలని సూచించారు.

నూతన కమిటీ ఎన్నిక

తిర్యాణి, ఫిబ్రవరి 25: మండల కేంద్రంలోని గోయగాంలో మండల పెరిక సంఘం నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బీఆర్ఎస్ సీనియర్ నేత, పీఏసీఎస్ వైస్ చైర్మన్ చుంచు శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా ఎలగతి వెంకటేశ్, పెట్టం మల్లేశ్, ప్రధాన కార్యదర్శిగా ముత్తె నర్సయ్య, కార్యదర్శిగా పెట్టం రామన్న, కోశాధికారిగా ముత్యం బుచ్చన్న, గౌరవాధ్యక్షులుగా కిలిశెట్టి శంకరయ్య, కోన మల్లేశ్‌ను ఎన్నుకున్నారు. అలాగే సుంగాపూర్, తలాండి, పెర్కపల్లి, గోయగాం, విజయనగరం, కన్నెపల్లి, గంభీరావుపేట గ్రామాల అధ్యక్షులుగా ముత్తె నర్సయ్య, ఆకుల రమేశ్, బోడకుంటి మల్లేశ్, పెట్టెం రాజేందర్, బుద్దె రమేశ్, అంకతి సురేశ్, మేడిశెట్టి వెంకటేశ్, తొంగల రాజ్‌కుమార్, అత్తె సత్తయ్య, శేఖర్, మండలయూత్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా బొడ్డు రవీందర్, అంకతి శ్రావణ్‌ను ఎన్నుకున్నారు.

మొక్కజొన్న పంట ధ్వంసం

దండేపల్లి, ఫిబ్రవరి25: అల్లీపూర్ శివారులో మాకుపేటకు చెందిన మహిళా రైతు ముత్తినేని రాజమణికి చెందిన మొక్కజొన్న పంటపై అడవిపందులు దాడిచేశాయి. నాలుగెకరాల్లో రాజమణి మొక్కజొన్న సాగు చేయగా, సుమారు ఎకరం వరకు అడవి పందులు పంటను ధ్వంసం చేశాయి. పగలు వేళలో పంటలను కాపాడుకుంటుండగా, రాత్రి సమయంలో దాడులు చేస్తున్నాయని బాధిత రైతు వాపోయారు. అటవీ అధికారులు స్పందించి.. నష్ట పరిహారం అందించాలని కోరుతున్నారు.

ధ్వంసమైన పంటను చూపుతున్న రాజమణి

మొక్కలు వాడిపోకుండా చర్యలు

వాంకిడి, ఫిబ్రవరి 25: వన మహోత్సవంలో నాటడానికి సిద్ధం చేస్తున్న మొక్కలు వాడిపోకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ ఉపాధి హామీ సిబ్బందికి సూచించారు. నవేగూడ గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన నర్సరీని ఏపీవో శ్రావణ్ కుమార్, ఈసీ మోసిన్‌తో కలిసి మంగళవారం పరిశీలించారు. మొక్కల పెంపకంపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంతకుముందు నవేగూడ గ్రామ పంచాయతీలో ఉపాధి హామీ పనులను పరిశీలించారు.

ఒకరిపై కేసు

దహెగాం, ఫిబ్రవరి 25: మర్రిపల్లికి చెందిన జర్పుల ఆలు నాటు సారా తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ రవి తెలిపారు. సిబ్బంది వాహనాల తనిఖీ చేస్తుండగా, ఆలు ద్విచక్ర వాహనంపై 10 లీటర్ల నాటుసారా తరలిస్తుండగా.. వెంటనే అదుపులోకి తీసుకొని ద్విచక్ర వాహనంతోపాటు నాటుసారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

వందశాతం అక్షరాస్యత మండలంగా తీర్చిదిద్దాలి

సమావేశంలో మాట్లాడ